
# పెళ్ళిచేసి చూపిస్తాం పెళ్ళి పెద్దనిపిస్తాం



మేం పూణె నుంచి హైదరాబాదుకు మకాం మార్చేశాం. ఆ చారిత్రాత్మక సంఘటన మర్చిపోకుండా వుండాలని ప్రయాణం మా అమ్మాయి అయిదవ పుట్టినరోజున పెట్టుకున్నాం. అప్పటికి మావారు పది సంవత్సరాలు, నేను ఎనిమిది సంవత్సరాలు పూణె నగరాన్ని వుద్ధరించినట్లు. మేము పని చేసిన ఆ జాతీయ రసాయనశాల మా ఇద్దరికీ చెరో డిగ్రీ ఇవ్వడమే కాక, జీవితమంతా ఛాలెంజ్‌లతో గడపడానికి అవసరమయే విజ్ఞానాన్నిచ్చి ఆశీర్వదించింది.

మా లాబ్‌లో డిగ్రీలు తీసుకునే విద్యార్థులు డిగ్రీ అయీ అవకుండానే అమెరికా ఫెలోషిప్ తెచ్చుకుని ఎగిరిపోయేవారు. ఒకవేళ ఉద్యోగస్థులు ఏడాదికోసమో రెండేళ్ళకోసమో అమెరికా వెళ్ళాల్సి వస్తే క్వార్టర్ ఖాళీ చేసేవారు. లాంగ్‌లీవ్ కదా! క్వార్టర్ తిరిగి ఇచ్చేయక తప్పదు. కానీ ఇంట్లో వున్న సామాన్లేం చెయ్యాలి? ఎవరింట్లో డైనింగ్ టేబిలుందో వాళ్ళింట్లో తమ డైనింగ్ టేబిల్‌నీ, ఫ్రిజ్ వున్న వాళ్ళింట్లో తమ

ఫ్రిజ్‌నీ, మంచాలున్నవాళ్ళింట్లో తమరి మంచాలనీ జాగ్రత్తగా దాచుకుని వెళ్ళేవారు. వస్తువులు వున్నవాళ్ళకిస్తే మనవి వాడుకోరు కదా! అంత జాగ్రత్తగా వుండేవాళ్ళన్న మాట! మేం చేసిన పని వింటే ఆశ్చర్యపోతారు. ఇంతా చేసి మేం పెర్మనెంటుగా వెళ్తున్నది పక్కవూరు లాంటి హైదరాబాదుకి. అక్కడ మాకు ఒక సొంత ఇల్లు కానీ వాకిలి గానీ ఏ గుడ్డూ లేదు. అన్నీ పుట్టి పెరగాల్సిందే. కాకపోతే ఒక నెలో రెండ్నెల్లో సంతోషంగా మా ఇంట్లో వుండమనేపాటి బంధువులున్నారు అంతే.. ఇంక మేము ఏదో పరాయి గ్రహానికి వెళ్ళేవాళ్ళలాగా గాస్ కనెక్షన్ ఒక మంచి ఫ్రెండుకీ, రుబ్బురోలు ఒక తెలుగు కుటుంబానికీ, మంచాలు కొత్తగా పెళ్ళయిన బెంగాలీ జంటకీ, డైనింగ్ టేబిలు కుర్చీలు మా వాచ్‌మన్ కీ అలా అన్నీ పంచేశాం. నాకు పెద్ద ఖరీదు లేని సింపుల్ పట్టుచీరలుండేవి. ఆరోజుల్లో ఉప్పాడ పట్టుచీరలు అరవై రూపాయలకి వచ్చేవి. నేను నా పెళ్ళికీ అవే కొనుక్కున్నాను. రోజూ లాబ్‌కి కట్టుకెళ్ళడంతో యాసిడ్ చిల్లులుండేవి. అలాంటివి ఒక అయిదారు చీరలు మా పనమ్మాయికిచ్చాను. అది ఆ చీరల మూట తీసుకెడుతుంటే పోలీసు ఆపాడుట. మూట చూసి ఏవిటని అడిగితే, "వూరెళ్ళిపోతూ మా అమ్మగారిచ్చిందని" చెప్పిందిట. "వూరెళ్ళిపోతుంటే పట్టుచీరలిచ్చే అమ్మగార్ని నేనూ చూస్తాను" అని ఆ పోలీసు మా ఇంటికి వచ్చాడు. "నిజమేనండి. నేనే ఇచ్చాను. చిన్నగా కొన్ని చిల్లులున్నాయి" అని చెప్పేటప్పటికి నాకేసి అదోలా చూస్తూ వెళ్ళిపోయాడు. నాలుగు సూటుకేసులూ, ఒక బస్తాడు గిన్నెలు తప్ప మిగతావన్నీ ఇచ్చేసినా మాకూ సెంటిమెంట్లున్నాయండోయ్. మా పెళ్ళయిన కొత్తల్లో డా.కృష్ణన్ గారని మా లాబ్‌లో సైంటిస్టు, జాయింట్ డైరెక్టరుగా ప్రమోషన్ మీద భావనగర్ వెళ్ళిపోతుంటే ఆయన దగ్గర వంద రూపాయలు ఇచ్చి కొన్న ఎర్ర సోఫాసెట్టు; వాళ్ళు దాన్నికొని అప్పటికి పదేళ్ళయిందిట. దాన్ని జాగ్రత్తగా పాక్ చేసి రైల్లో వేసి తెచ్చుకున్నాం. ఇప్పటికీ మా ఇంట్లో క్షేమంగా వుండి, మొన్నీమధ్య షష్ఠిపూర్తి కూడా చేసుకుంది. అది తప్ప మాకు వేరే పూణె జ్ఞాపికలేవీ లేవు.

అలా మొత్తం చేతులు దులిపేసుకుని ఆ నెల జీతాలు తీసుకుని వుద్యోగాలు రిజైనిచ్చి తేలికపడి హైదరాబాదు వచ్చాం. దేనికోసమన్నా కాకపోయినా ఈ తెలివితక్కువతనానికన్నా మాకో ఎవార్డు ఇవ్వచ్చు కదా! స్టేషనుకి మా పెద్ద చెల్లెలూ, పిన్నత్తగారబ్బాయి చందు వచ్చి మాకు స్వాగతం పలికారు. వాళ్ళు మాకు స్వాగతం పలికిన వేళ మంచిది. మేము భాగ్యనగరంలో పాదం మోపిన సమయమూ మంచిదే! ఒక నెల రోజులు మా చిన్నారింట్లోనూ, ఇంకో నెల మా చిన్నత్తగారింట్లోనూ వుండి ఫాక్టరీ పెట్టడానికి కావల్సిన ఏర్పాట్లన్నీ చేసుకున్నాం. బాలానగర్లో ఒక ఇల్లు అద్దెకు తీసుకుని ఫాక్టరీలోనూ, ఇంట్లోనూ మే ఒకటవ తేదీన ప్రవేశించాం. అది మేడే.

బహుశా అదీ మంచిరోజే అయివుంటుంది. అలా నలభైరెండేళ్ళ క్రితం పనిచేయడం మొదలుపెట్టిన మా ఫాక్టరీ ఈ రోజున కూడా మాకూ, మాతోపాటు ఇంకో ఏభై కుటుంబాలకీ అన్నం పెడుతోంది.

అయిదారు నెలల తర్వాత కొత్తకారు కొనుక్కున్నాం. మళ్ళీ రెండు గాస్ కనెక్షన్లు తెప్పించుకున్నాం. కలప కొని మంచాలు, డైనింగ్ టేబిల్ చేయించాం. మా ఇంటికొస్తే మీరు వాటన్నిటినీ చూడచ్చు. ఇప్పటికీ ఆ కారు కూడా నడిపిస్తున్నాం. ఒకరోజు ఆఫీసులో వుండగా మా ఆయన నన్ను పిలిచి "మనమింత బాగా సెటిలయి పదిమందికి వుద్యోగాలు ఇస్తున్నపుడు మీ నాన్నగారింకా ఎవరి దగ్గరో వుద్యోగం చేయడం ఎందుకు? వాళ్ళని వచ్చేయమను. మనందరం హాయిగా కలిసుందాం" అన్నారు. నేను చాలా ఆశ్చర్యపోయాను. నాకంతవరకు ఆ ఆలోచన రాలేదు. ఏదో చిన్నదో, పెద్దదో వుద్యోగం చేస్తున్నారు కదా! బాగానే వున్నారు కదా! అని నేను పట్టించుకోలేదు. నా తల్లిదండ్రుల గురించి నాకన్నా ఎక్కువగా ఆలోచించే భర్త దొరకడం మామూలు విషయమా? అయినా ఆ రోజుల్లో ఆడవాళ్ళకి సంపాయించే స్వాతంత్రం వచ్చిందేమో గానీ, ఆలోచించే స్వాతంత్రం వచ్చినట్లు లేదు. అదీ కాక అమ్మాయి ఇంట్లో అమ్మానాన్నలుండడం కూడా ఎక్కడా కనపడేది కాదు. "ఏమో ఎవరి పద్ధతులు వాళ్ళవి! మళ్ళీ ఏవన్నా తేడాపాడాలొస్తాయేమో" అని నేను భయపడ్డాను. కానీ మా నాన్న ఏమీ భయపడలేదు. ఎవరైనా ఏవన్నా అనుకుంటారేమోనన్న ఆలోచనలు కూడా చేయలేదు. వెంటనే విశాఖపట్నంలో చేస్తున్న వుద్యోగం వదిలేసి అమ్మనీ తమ్ముడ్ని తీసుకుని సంతోషంగా, దర్జాగా వచ్చేశారు. బుజ్జి మా ఫాక్టరీలోనే పని చేస్తూ వుండేది. అప్పట్లో మా ఫాక్టరీలో పని చేసే అమ్మాయిలంతా మాకు దగ్గిరో దూరమో బంధువులే. అది ఒక బ్రాహ్మణ అగ్రహారంలా వుండేది. ఏమీ చదువుకోని, ఏ పనీ రాని ఆడపిల్లలకి సుశీల వుద్యోగాలిస్తోందిట అని గొప్పగా చెప్పుకునేవారు. మా ఇంట్లో కనీసం ఇద్దరు ముగ్గురు ఆడపిల్లలు ఇంకా సెటిలవని వాళ్ళు వుండేవారు. మా అత్తగారికి తరతమబేధం లేదు. నీ నా బేధం లేదు. అందరిపట్లా ఒకటేరకం ఆప్యాయత. అన్నగారూ, వదినగారూ అంటూ మా నాన్నని అమ్మని ఎంతో సంతోషంగా కలిపేసుకున్నారు. అమ్మ పగలు, అత్తగారు రాత్రి వంట చేసేవారు. ముగ్గురూ కలిసి పేకలాడుకునేవారు. మా నాన్న అన్నీ రాంగ్ షో లు చేసేవారు. ముగ్గురూ వాదించుకుంటూ కూచునేవారు. వాళ్ళకదే కాలక్షేపం. వీళ్ళకేమన్నా లాటరీ దొరికిందా అని అనుమానం వచ్చేంత ఆనందంగా వుండేవారు. ఆదివారం కానీ పండగ రోజులలో కానీ చిన్నారి ఇంటికో, మా పిన్ని వాళ్ళ ఇంటికో వెళ్ళి సాయంత్రానికల్లా వచ్చేసేవారు. ఆదివారం

సాయంత్రం దూరదర్శన్‌లో వచ్చే తెలుగు సినిమా చూడ్డం కోసం స్నానాలు చేసి మంచి బట్టలు కట్టుకుని పెద్ద కుర్చీలలో కూచుని అచ్చు సినిమాహాల్లో లాగే చూసేవారు. మా ఇంట్లో నేల క్లాసు, బెంచీ క్లాసు కూడా వుండేవి. మా వీధి చివర్లో వున్న లంబాడీతండా లోంచి పది, పదిహేనుమంది పిల్లలు, ఆడవాళ్ళు వచ్చి ముందు వరసలో కూచుని సినిమా చూసేవారు. ఇంటర్వెల్‌లో అంటే బ్రేక్ అప్పుడు అత్తయ్యగారు అందరికీ వేయించి ఉప్పు ఖారం జల్లిన మరమరాలు కూడా సప్లైచేసేవారు. అది మా జీవితంలో ఒక సువర్ణాధ్యాయం. కూచుని తల్చుకుంటేనే ఇంత బాగుంది. ఇంక నిజంగా అప్పుడు ఎంత బాగుండేదో!

పిల్లలందరూ ఏదోవిధంగా సెటిలయ్యారు. బుజ్జిక్కూడా పెళ్ళి చేసేస్తే బాగుంటుందని మా అమ్మకి కొంచెం ఆరాటం మొదలయింది. అదీగాక మా ఆయన చెప్పిన జాతకం ప్రకారం కూడా చిన్నారి పెళ్ళి అయి అయిదేళ్ళవస్తోంది. నేను రెండు మూడు సంబంధాలు చూశాను కానీ కలిసి రాలేదు. మా ఆయన నన్ను పిలిచి, " సుశీలా! పెళ్ళి సంబంధాలు చూసే పని నువ్వు పెట్టుకోకు. ఆ బాధ్యత వాళ్ళకే వదిలేయ్. ఎంత కట్నమయినా ఫరవాలేదు. మంచి సంబంధం చూడమను. మనం పెళ్ళిచేసే బాధ్యత తీసుకుందాం" అని చెప్పారు. నేను కూడా అన్నిటికీ ఎదిరించేదాన్ని కాదు. ఏమో ఎందుకు చెప్పారో ఏవిటో అని కొన్ని విషయాలు చెప్పినట్లు వినేదాన్ని. అమ్మా నాన్నా ఏవో కొన్ని ప్రయత్నాలు చేసేవారు. కానీ చివరివరకూ ఏదీ సాగేది కాదు. అలాగే అయిదారు నెలలు గడిచిపోయాయి. మా అక్క మావయ్య పిల్లలతో భోపాల్ వెడుతూ, కూడా మా బుజ్జిని తీసుకెళ్ళారు. అక్కడ మా మావయ్య ఫ్రెండొకాయన స్టేట్‌బాంక్‌లో పెద్ద వుద్యోగంలో వుండేవారు. ఆయన బావమరిది ఛత్తర్‌పూర్‌లో సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్ స్కీం కింద వ్యవసాయ పనిముట్లు అమ్మడం, సర్వీసెస్ ఇవ్వడం చేస్తుండేవాడు. ఆ అబ్బాయికి మా బుజ్జిని చూపించడం అతను సరే అనడం జరిగిపోయాయి. మా మామయ్య, అతని బావగారూ కలిసి మాట్లాడుకుని సంబంధం ఖాయపరిచారు. ఇలా సంబంధం కుదిర్చామని మాకు తెలియపర్చారు. పెళ్ళివారు రాజమండ్రి వాళ్ళు. వాళ్ళతో బీరకాయపీచు చుట్టరికాలు కూడా వుండేవి. ఇంట్లో అందరం సంతోషంగా అంగీకరించాం. తాంబూలాలు పుచ్చుకుందాం అంటే "అవసరం లేదు. మళ్ళీ అదో అనవసరపు ఖర్చు. మాట అనుకున్నాం కదా! చాలు" అని వియ్యంకుడుగారు మాకో ఖర్చు తప్పించారు.

కానీ మాకు అసలు పేచీ ముహూర్తాల దగ్గరే వచ్చింది. మా ఆయనకి కొంచెం

జాతకాల నమ్మకం వుంది కదా! కాని సంబంధం కుదిర్చిన మా మావయ్యకి ఏ నమ్మకాలు లేవు. పైగా కొంచెం వ్యతిరేకం కూడాను. వాళ్ళిద్దరి జాతకాలు అంత ఎక్కువగా కలవలేదు కాబట్టి పెళ్ళి ముహూర్తం జాగ్రత్తగా ఆలోచించి పెట్టాలని మా ఆయన ఆలోచన. చాలా కష్టపడి బోలెడు స్టడీ చేసి, ఫిబ్రవరి 22 రాత్రి బాగుందన్నారు. కానీ వియ్యంకుడి గారిక్కూడా ఇలాటి నమ్మకాలు తక్కువ. ఫిబ్రవరి వరకు ఆగడం కష్టం. జనవరి అయితే తమ పిల్లలందరూ వుంటారు కాబట్టి జనవరి 30 రాత్రి భోజనాలయ్యాక పది గంటలకి చేసేద్దాం అని ఆయన ముహూర్తం పెట్టేశారు. దాంతో మా ఆయనకి కోపం వచ్చి "నా మాట ఎవరూ వినరేవిటి? వద్దు మొర్రో అంటుంటే ఇదేం ముహూర్తం? అసలపుడు ముహూర్తమే లేదు. నానా అవస్థలూ పడతారు" అని ఈయన కోపగించుకున్నారు. "ఏదో ఒకటి లెద్దురూ! వాళ్ళు చెప్పినట్టే విందాం!" అంటే "ఏవిటి వినేది! ఇది జీవితం" అని నా మాట వినిపించుకోలేదు. అట్లా మొదట్లోనే మా ఆయనకి కోపంవచ్చేయడంతో నాకు కాళ్ళు చేతులాడలేదు. అసలే నేను అప్పటివరకూ ఏ శుభకార్యమూ చూసినదాన్నీ కాదు, చేసినదాన్నీ కాదు. సీతమ్మవారి వనవాసంలా పదేళ్ళపాటు ఆ దేశం కాని దేశంలో పడి వున్నాం! ఓ పెళ్ళి లేదు, పేరంటమూ లేదు. ఎంత సేపూ లాబ్ కెళ్ళడం, ఇంటికొచ్చి పడుకోడం. ఇప్పుడింత శుభకార్యం తలకెత్తుకున్నా! పోనీమని మా అత్తగారు కానీ అమ్మగానీ ఏమన్నా చెప్పబోయినా వినిపించుకోడమూ నాకలవాటు లేదు. కొత్తగా డబ్బులొచ్చిపడ్డ అహంకారం ఎటూ తోడు వుండనే వుంది. దాంతో పెళ్ళి ఏర్పాట్లు సరిగా జరక్క అందరం ఇబ్బంది పడ్డాం.

పెళ్ళి ఖర్చులకని పెళ్ళివారికి డబ్బు ఇచ్చేటపుడు మా అమ్మ "మీరు పిల్లకి కొనే నగలకి, చీరలకి ఎంత పెడదామనుకుంటున్నారో చెప్తే ఆ సొమ్ము అట్టే పెట్టి ఇక్కడ దానికి నచ్చినవి కొంటామ"ని ఎంతో నియోగంగా చెప్పింది. కానీ వాళ్ళు వింటేనా! మాకు రాజమండ్రిలో ఎప్పటినుంచో తెలిసిన కంసాలున్నాడు, పట్టుచీరల కొట్ల వాళ్ళున్నారు! మాకూ ఫాషన్లు తెలుసు. మేమే తెస్తాం. అదే పద్ధతి" అన్నారు. ఇంకేం చేస్తాం! మా తెలివి గోదాట్లో పోసినట్లయింది.

నేను ఫాక్టరీలో వున్నప్పుడు మా ఇంటికో వంటాయన వచ్చాడుట. మా పిన్నివాళ్ళ అమ్మాయి పెళ్ళిలో తనే వంట చేశానని, ఎందరో రాజకీయనాయకులు, సినిమా వాళ్ళ ఇళ్ళల్లో తననే పిలుస్తారని ఏవేవో పెద్ద కబుర్లు చెప్పాడు. ఆయన చెప్పిన మా పిన్ని కూతురి పెళ్ళికి పూణెలో వున్న నేనూ వెళ్ళలేదు. విశాఖపట్నంలో వున్న అమ్మా వెళ్ళలేదు. పోనీ మా పిన్నినడుగుదామంటే ఆవిడ వూళ్ళో లేదు. మా అమ్మ

ఆయన చెప్పిన కబుర్ల మాయలో పడిపోయి పెళ్ళి వంటకి అయన్ని కుదిర్చేసింది. ఆయన దగ్గర ఏయే వంటకి ఏ సరుకులు కావాలో లిస్టులున్నాయి. మా అమ్మ నాలుగు భోజనాలు, రెండు పొద్దున్న టిఫిన్లూ, రెండు సాయంత్రం టిఫిన్లూ, సారె స్వీట్లుతో సహా చేయడానికి కావల్సిన సరుకుల లిస్టు తీసుకుని ఆయన చేతిలో అయిదువందలు ఎడ్వాన్సు పెట్టి ఇచ్చేసింది. ఇంటికి వచ్చాక విషయం తెలుసుకున్న నాకు పట్టరాని కోపం వచ్చి అమ్మతో తగవేసుకున్నాను. "పిన్ని వాళ్ళని అడిగి తెలుసుకునే వాళ్ళం కదా! ఎందుకంత తొందరపడ్డావ్" అని! మా అమ్మ మా అత్తగారిలా నెమ్మదస్థురాలు కాదు. ఎంతైనా నా పోలికే కదా! నేను ఒకటంటే తను పదనేది. పైగా తను బి.పి.పేషెంటు. మా ఇద్దర్నీ విడదీయడానికి మా ఆయన కల్పించుకోవాల్సి వచ్చింది. అంటే ఏం లేదు. ఎవరక్కడా అంటారు. అంతే! ఎవరి గదుల్లోకి వాళ్ళు పోవడమే! మళ్ళీ చీమ చిటుక్కుమంటే వట్టు. అసలు మా ఆయన ఇంట్లో వుంటే మనసారా మాట్లాడుకోడానికుండేదే కాదు. ఇంకా పోట్లాడుకోవడం కూడానా!

అప్పట్లో మేం సంజీవరెడ్డి నగర్లో వుండేవాళ్ళం. మాకు చాలా దగ్గర్లోనే కమ్యూనిటీ హాలుండేది. దాని ఎదురుగా మాకు తెలిసున్న ప్లీడరుగారిల్లు వుండేది. ఆయన్నడిగి ఆ ఇల్లు విడిదికి తీసుకుని కమ్యూనిటీ హాలుని రెండురోజులకి బుక్ చేసాం. పెళ్ళివారు పొరుగూరు నుంచి వస్తారు కదా! పెళ్ళి ముహూర్తం రాత్రి పదిన్నరకి. జనవరి నెల కదా పెందరాళే చీకటి పడిపోతుంది. భోజనాలు తొమ్మిదికయిపోతాయి కాబట్టి ఆ తరువాత ఆ హాల్లోనే పెళ్ళి చేయవచ్చు అని ఆలోచించాను. నాకున్న తెలివంతా వుపయోగించి బయట భోజనాలకి వేరే షామియానా వేయకుండా డబ్బు ఆదా చేసానన్నమాట. ఆ తెలివి తక్కువ నిర్ణయం వల్ల నేను ఎంత ఇబ్బంది పడ్డానో తర్వాత మనవి చేస్తాను.

అప్పుడు మా ఇంట్లో మా పెద్దత్తగారూ ఆవిడ కూతురూ వుండేవారు. ఆవిడ పేరు అన్నపూర్ణమ్మ. పదిమంది పిల్లల్ని కన్నతల్లి అసలు మా అత్తగారి అక్క చెల్లెళ్ళెవరూ కూడ కఠినంగా గానీ బిగ్గరగా గానీ మాట్లాడేవారు కాదు. కూతుళ్ళనీ కోడళ్ళనీ ఒకేలా చూసేవారు. ఎప్పుడూ ఏదో ఒక పని చేస్తూనే వుండేవారు. ఆ సమయంలో ఆవిడ మా ఇంట్లో ఎందుకు వున్నారో నాకు జ్ఞాపకం లేదు. ఆవిడ చేతి వంట ఆవిడ పేరుకి తగ్గట్లుగానే జగత్ప్రసిద్ధం. మా ఇంట్లో పెళ్ళి అనుకోగానే ఆవిడ గోంగూర, చింతకాయ, పళ్ళకారం, దోసావకాయ, కందిపొడి వగైరాలన్నీ అత్యద్భుతంగా చేసిపెట్టారు. అసలు చింతకాయ పచ్చడి అంత బాగుంటుందని

అప్పటిదాకా నాకు తెలియనే తెలియదు. ఏమయినా గోదావరి జిల్లా వాళ్ళకన్నా, కృష్ణాజిల్లా వాళ్ళు పచ్చళ్ళు బాగా చేస్తారని ఒప్పుకోక తప్పదు. ఆవిడ మహాఇల్లాలు కాబట్టి ఆ వయసులో అంతకష్టపడ్డారు గానీ ఎవరైనా చెల్లెలి కోడలి చెల్లెలు పెళ్ళికి అంత చాకిరీ చేస్తారా? ఆ రోజులూ వేరు ఆ మనుషులూ వేరు. నన్నేం కంగారు పడద్దనీ పనులన్నీ తాము చేస్తామనీ మా వాళ్ళంతా అంటే మా అమ్మ వేపు బంధువులంతా నాకు బోలెడు ధైర్యం చెప్పారు. వాళ్ళ మాటలన్నీ నేను మనస్ఫూర్తిగా నమ్మాను.

ఆడపెళ్ళివారమంతా సాయంత్రం నాలుగింటికి సామాన్లన్నీ వేసుకుని పెళ్ళిహాలుకి చేరాం. ముహూర్తం విషయంలో తనకున్న అనుమానాలను మనసులో పెట్టుకుని మా ఆయన పెళ్ళికి రానని చెప్పి భోజనం మాత్రం పంపించమని ఆర్డరిచ్చుకున్నారు. పెళ్ళివారు రాత్రి ఎనిమిదిగంటలకి వచ్చారు. వంటాయన ఒక అరవై డెబ్బైమందికోసం వంట బాగానే చేసాడు. అందరూ భోజనాలు చేసి పెందరాళే పడుకున్నారు. తెల్లారగట్ల పెళ్ళికొడుక్కి వడుగు, స్నాతకం అన్నీ ఈ హాల్లోనే. మర్నాడు తెల్లవారుతూనే  వడుగూ, స్నాతకం, పెళ్ళివారికి టిఫిన్ల హడావిడిలో పడి మా చుట్టాల అజ కనుక్కోవడం ఆలస్యం అయింది. దాంతో  దగ్గర నిలబడి అన్నీ సాయం చేస్తామన్న మా చుట్టాల్లో కొందరు టిఫిన్లు తినడానికి హెూటల్‌కెళ్ళిపోయారు. మా అమ్మకి బి.పి. పెరిగి కళ్ళు తిరిగి పడిపోయింది. డాక్టరుగారొచ్చి అమ్మకి ఇంజక్షనిచ్చి సెలైన్ పెట్టి సాయంత్రం వరకూ మెలకువ రాకుండా చేసి వెళ్ళారు. ఇంక అన్ని పనులకీ నేనూ మా చిన్నారీ. ఆడపిల్లలం ఎన్నని చేస్తాం!

మా అమ్మ కుదిర్చిన ఆ వంటవాడు పెద్ద దొంగ. పొద్దున్న టిఫిన్లు, మధ్యాహ్నం స్నాతకం వంట బాగా చేయడంతో ఇంకమేమంతా ఫ్లాట్ అయిపోయి వాడ్నికూడా మాలో కలిపేసుకున్నాం. వంటగది స్టోర్సు వాడికప్పచెప్పేసి అందరం ఎక్కడివాళ్ళక్కడ సద్దుకున్నాం. రాత్రి డిన్నరుకి ఆరేడు వందల మంది వస్తారని అంచనా. ఆరువందల మందికి సరిపడా అన్నీ చేసి, ఇంకో వందమందికి తయారుగా వుండమని చెప్పాను. మంచి వెజిటబుల్ బిరియానీ, పూరీ కుర్మా, దహీవడ, జాంగ్రీ, బాదంఖీరూ లాంటి అయిటెమ్సుతో బ్రహ్మాండమయిన మెనూ. ఏడుగంటలకల్లా వంటయిపోవాలని చెప్పాం! “మీకెందుకమ్మాయిగారూ! అదరగొట్టేస్తా చూడండి” అని నమ్మకంగా కబుర్లు చెప్పాడు. తీరా అయిదింటికి కట్టెలు చాలవన్నాడు. నాకా కట్టెలడితీ ఎక్కడుందో ఎలా తెలుస్తుందీ? మా నాన్న, తమ్ముడు రిక్షాలో బయల్దేరారు కట్టెలు తేవడానికి! ఒకటి కాదు. పెళ్ళిలో వధూవరులు మార్చుకోడానికి పూలదండలు ఆర్డరివ్వలేదని

గ్రహించాం. అప్పుడు మా చిన్నత్తగారు "నే తెస్తాలేమ్మా! మోండా మార్కెట్లో దొరుకుతాయి" అని ఆటోలో వెళ్ళి తెచ్చారు. తీరా చూస్తే అవి బంతిపూల దండలు". "నా పెళ్ళి బంతిపూల దండలతోనా" అంటూ బుజ్జి ఒకటే ఏడుపు! నాలుగు కేకలేసి దాన్ని వూరుకోపెట్టాను. ఒక్కొక్కళ్ళే రావడం, ఏమిటీ అని అడగడం 'అయ్యో ముందు చూసుకోవద్దూ' అని బయటికి వెళ్ళి ఇంకో నలుగురికి చెప్పడం. ఇదీ నాకు లభించిన సాయం.

అన్నట్లు మధ్యాహ్నం భోజనాలయ్యాక మగపెళ్ళివారు "మాకు రాత్రి టేబిల్ మీల్సు" కావాలని కబురు చేసారు. ఒక బాచ్ మగపిల్లలు నాలుగయిదు షాపులు తిరిగారు కానీ ఆదివారం మధ్యాహ్నం ఒక్క టెంట్ హౌస్ కూడా తెరిచిలేదు. కష్టం మీద అయిదారు టేబుల్స్ సంపాయించాం. కిందకూచోలేని వాళ్ళకి బల్లల మీద పెడతాం అని వాళ్ళకి మళ్ళీ కబురు చేశాం. పాపం వాళ్ళేమీ మాట్లాడలేదు. అప్పటికీ ఇప్పటికీ పెళ్ళి ఏర్పాట్లలో ఎన్ని మార్పులొచ్చాయో చూడండి. భోజనాలు కేటరింగే, పురోహితుడూ కేటరింగే, చివరికి పెళ్ళి మొత్తం కేటరింగే! చేతిలో డబ్బుంటే చాలు. ఫోను చేసే వ్యవధుంటే పెళ్ళి చేసెయ్యవచ్చు. కానీ ఆరోజుల్లో సూది మొదలు సూత్రాల వరకూ అన్నీ స్వయంగా అమర్చుకోవలసిందే! ఏది మర్చిపోయినా కష్టమే. ఇపుడన్నీ కాంటాక్టు పద్ధతులొచ్చేశాయి. కాబట్టి ఏ అనుభవమూ లేని వాళ్లుకూడా డబ్బుంటే తేలిగ్గా పెళ్ళి చేసెయ్యచ్చు.

ఇంక సాయంత్రం అయేసరికి బంధువులు రావడం మొదలుపెట్టారు. ఆరున్నర ఏడింటికి ఎదురు సన్నాహం అయింది. ఆ టైముకి కష్టపడి మా అమ్మని నిద్రలేపాం. ఏడున్నరయింది కదా అనుకుని వంట దగ్గిరకెళ్ళాను. ఇంకా వంట పూర్తికాలేదు. ఒక గంటలో అయిపోతుందని పెద్ద పోజుగా చెప్పాడు. అంటే ఈయన వంట ఎనిమిదిన్నరకి గానీ అవదన్నమాట. పూర్తయిన వంటలు చూస్తే అన్నీ కొంచెం కొంచెంగా కనిపించాయి. ఆ వంట ఆరువందలమందికి సరిపోదని ఏ మాత్రం అనుభవం లేని నాకే తెలిసిపోతోంది. "ఏవిటండీ! ఇంత కొంచెం కనిపిస్తున్నాయి! ఎలా సరిపోతుంది?" అని అడిగితే "మీకెందుకమ్మా పెద్ద గిన్నెలు కాబట్టి మీకలా కొంచెంగా కనిపిస్తున్నాయి! నేను వద్దన జాగ్రత్తగా చేయిస్తాగా! మీరు కల్పించుకోకండి" అంటూ లేనిపోని కబుర్లు మొదలుపెట్టాడు. కష్టపడి ఎనిమిదిన్నరకి వూళ్ళో పిలచిన పెద్దమనుషులకి పెళ్ళివారిలో కొద్దిమందికి మొదటి బంతి వడ్డించాం. మొదటి బంతికే ఆయన చేసిన వంటంతా అయిపోయింది. తర్వాత భోజనాలు చేసిన వాళ్ళకి పూరీలూ లేవు, బిరియానీలూ లేవు. మా బాబాయిలిద్దరు వంట వాడ్ని చంపేస్తామని

బెదిరిస్తే ఇంకో రెండు కూరలు చేసాడు. సారెకని చేయించిన లడ్డూలు చితక్కొట్టి చిన్నవిగా చేసి వడ్డించాం. మా పెద్దత్తగారు ఎంతో ప్రేమగా శ్రద్ధగా చేసిన పచ్చళ్ళు కందిపొడుమే ఆ పూట పెళ్ళికొచ్చిన వాళ్ళ కడుపు నింపాయి. భోజనం వేళ తప్పితే మా ఆయనకి వెర్రికోపం వస్తుందని ముందుక్యారేజి సద్ది ఇంటికిపంపాను. ఇక్కడ ఈహడావిడి నడుస్తుంటే ఇంకో పక్క పెళ్ళి తంతు మొదలుపెట్టేశాడు పురోహితుడు. వరపూజ, కన్యాదానం అన్నీ గబగబా జరిగిపోతున్నాయి. అటు పెళ్ళి ఇటు భోజనాలంతా ఒక హాల్లోనే! ఒకటే గందరగోళం.

ఇలా నానావస్థలూ పడుతూ భోజనాలయ్యాయనిపిస్తుంటే ఏదో ప్రపంచాన్ని జయించిన వాడిలా ఆ వంటాయన పెళ్ళి హాల్లోకి వచ్చి "అమ్మగారూ బాగున్నారా? అమ్మాయి అల్లుడూ బాగున్నారా?" అంటూ మా పిన్నిని పలకరించాడు. "ఆ బాగానే వున్నార'ని సమాధానం చెప్పి నాకేసి తిరిగి "వీడ్నెందుకు పెట్టుకున్నారే తల్లి. వీడొక పెద్ద దొంగ. వంటకిచ్చిన సరుకులన్నీ ప్రహరీగోడమీంచి బయటికి దాటించేస్తాడు! పైగా సరుకు తక్కువిచ్చారంటాడు. చిట్టి పెళ్ళిలో నా గడ్డి నేను తిన్నాను" అని బాధపడింది. ఏం చేస్తాం. మర్నాటి వంటకి ఇంటి దగ్గర్నించి సరుకులు తెప్పించి ఏర్పాటు చేశాను.

పెళ్ళి మాత్రం సలక్షణంగా జరిగింది. బ్రాహ్మలు ఆ తంతు అయేవరకూ నిలబడనీయరు కదా! నాగవల్లీ, స్థాలీపాకం కూడా అయేటప్పటికి రాత్రి ఒంటిగంటయింది. మర్నాడు పొద్దున్న వచ్చి అప్పగింతలు చేయిస్తామని చెప్పి బ్రాహ్మలు వెళ్ళిపోయారు. ఇంక పెళ్ళివారు మేము అనుకున్నదానికన్నా ఎక్కువ బంగారమే పెట్టారు. రెండు జతల గాజులూ ఒక నెక్లెసూ. కానీ అవి మాకెవరికీ నచ్చలేదు. చాలా బరువుగా నాటుగా వున్నాయి. ఒక అందం చందం లేవు. చీరల్లో ఒకటి బాగుంది కానీ రెండోది దాని మోకాళ్ళ దగ్గరకొచ్చింది. మళ్ళీ బుజ్జిని వూరుకోపెట్టడం కష్టమయింది. ఆ పొట్టి చీర చూసి అది ఎంత బాధపడిందో! పోనీలేవే! ఇంకోటి కొనుక్కుందాం అంటే వినదే! ఇంకోటి కొంటే అది పెళ్ళిచీరవుతుందా? అని వాదన. రాత్రి పెళ్ళి భోజనాల విషయంలో జరిగిన గందరగోళానికి మా అమ్మ వంటవాడిని నానా తిట్లూ తిట్టింది. దాంతో మర్నాడు పగలు వంట బ్రహ్మాండంగా చేసి కాళ్ళమీద పడి తప్పు చెప్పుకుని నిష్క్రమించాడు. పెళ్ళి ఫోటోలు తీస్తానని పెద్ద కెమెరాతో పందిట్లో సందడి చేసిన మా వాడొకడు పెట్టిన రీల్ సరైంది కాదుట. కాబట్టి ఆ పెళ్ళికి సాక్ష్యం లేదు. ఇంత గోల జరిగినా మగపెళ్ళివారు ఒక్కమాటంటే వట్టు. ఎంతో సంస్కారంగా ప్రవర్తించి మమ్మల్ని

ఆశీర్వదించి పిల్లను అప్పుచెప్పుకుని సంతోషంగా వెళ్ళిపోయారు. మేము మర్యాదలు సరిగా చేయలేదని మా ఆడపెళ్ళివారిలోనే కొందరు అలిగి వెళ్ళిపోయారు. మర్నాడు తిరిగిచ్చి నేను ఒక్కదాన్ని కమ్యూనిటీ హాలు మెట్ల మీద కూచుని ఒక్కొక్క వస్తువే టెంట్‌హౌస్ వాడితో ఎకౌంట్ సెటిల్ చేస్తుంటే మా ఆయన వచ్చి నా వెనక నించున్నారు. "పెళ్ళికి ముందు ఎవరైనా సాయం చేస్తారు. ఈ పనికే తోడుండరు. వాడు నాలుగు గ్లాసులు తగ్గాయంటే డబ్బులిచ్చేయ్. అనవసరంగా వాదించి తలనెప్పి తెచ్చుకోకు" అని నాకు హితబోధ చేసి క్షేమంగా ఇల్లు చేర్చారు. అందుకే "పెళ్ళి చేసి చూడు" అంటారేమో మనవాళ్ళు.

మా ఆయన భయపడ్డట్టుగా తొలినాళ్ళలో ఎన్నో ఆర్థికంగాను, వ్యాపారపరంగాను ఇబ్బందులు పడ్డా వాటినన్నిటినీ దాటేసుకుని శాంతి సౌభాగ్యాలతో, పిల్లాపాపలతో జీవితాన్ని గడుపుతూ ఆనందంగా వున్నారు ఆ జంట.

✤